ఈశ్వరార్పణతో చేస్తే ఫలితం వస్తుంది, దానితోపాటు జ్ఞానం కూడా వస్తుంది. మనం కోరదగినవాడు భగవంతుడు ఒక్కడే. మనం కోరినది ఇవ్వటానికి సమర్థుడు ఆయనే. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అదే చైతన్యం, వాడే నారాయణుడు. అది లేని ప్రాంతం లేదు, అది అన్ని కాలాలలో ఉంది, అది మన హృదయంలో కూడా ఉంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడినప్పుడు సంతోషం ఎలా వస్తోందో, ఎవరైనా నిందించినప్పుడు మీకు బెంగ, చింత ఎలా వస్తోందో, ఇప్పుడు మీకు దేహంతోటి, మనస్సుతోటి ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో, చైతన్యంతో మీకు తాదాత్మ్యం వచ్చేవరకు మీకు శాంతి లేదు, ఆనందం లేదు. చైతన్యం తాలూక అనుభవం మీకు రాకపోతే ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలలో కూడా ఏ జీవుడిని దుఃఖం విడిచిపెట్టదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-02-05, గుమ్మలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాలి వేసినప్పుడు నీళ్ళు ఎలా కదులుతూ ఉంటాయో అలాగ మన మనస్సు ఎప్పుడూ కదులుతూ ఉంటుంది. మనకు స్థిరబుద్ధి కలగటం చాలా కష్టం. పూర్వజన్మలలో పుణ్యకర్మలు చేసి ఉంటే, సత్కర్మ చేసి ఉంటే మనకు స్థిరబుద్ధి కలుగుతుంది, సాత్వికబుద్ధి కలుగుతుంది. మనం చెప్పకొనే మాటలకు, చావుపుట్టుకలకు అతీతంగా, వీటితో ఏమీ సంబంధం లేకుండా ఒక సత్యవస్తువు మన హృదయంలో ఉంది. దానినే బ్రహ్మం అని, నారాయణుడు అని మనం అంటున్నాము. అది తప్పించి మిగిలినవి అన్నీ మిధ్య, స్వప్న సమానము. బ్రహ్మంకు భిన్నంగా మనం ఏవస్తువును చూసినా, ఏవ్యక్తిని చూసినా ఆ వస్తువుగాని, వ్యక్తిగాని మనకు దుఃఖకారణం అవుతుంది. ఉన్నది బ్రహ్మం ఒక్కటే, అది మీ హృదయంలో అంతర్యామిగా ఉంది. అసలు బ్రహ్మం అంతర్యామిగా లేకుండా ఏ శరీరం కూడా ఈ భూమి మీదకు రాదు, అది జంతుశరీరం అవ్వవచ్చు, మానవశరీరం అవ్వవచ్చు. ఉన్నది బ్రహ్మం ఒక్కటి అంటే ఒక్కటే, రెండవది లేనేలేదు. మనకు ఒక రూపం ఉంది, దానికి ఒక పేరు ఉంది. మన జీవితం అంతా ఈ నామరూపాల చుట్టూ తిరుగుతూ ఉంటాము. అలాగే బ్రహ్మంకు కూడా ఒక రూపం పెట్టుకొన్నాము, ఒక నామం పెట్టుకొన్నాము. అవీ నామ రూపములే, ఇవీ నామరూపములే. మన నామరూపాలను ఆయన కల్పిస్తే, ఈ నామరూపములు ఆయనకు నామ రూపాలను కల్పిస్తున్నాయి. హృదయంలో ఉన్న బ్రహ్మం, సత్యవస్తువు నామరహితం, రూపరహితం, లోకరహితం, పంచభూతరహితం. మనం 40 రోజులు అన్నం లేకపోతే చనిపోతాము, కొన్ని నిమిషాలు గాలి లేకపోతే చనిపోతాము, మన జీవితాలు అటువంటివి.

కాని లోపల ఉన్న బ్రహ్మంకు పంచభూతములతో సంబంధం లేదు, అది స్వతంత్రంగా ఉంటుంది. ఈ భౌతిక విషయాలతో సంబంధం లేకుండా ఒక వస్తువు మన హృదయంలో ఉంది అనే విశ్వాసం మనకు లేదు.

మన లోపల జీవితం వేరు, బయట జీవితం వేరు. మనం లోపల ఒకలాగ ఉంటాము, బయట ఒకలాగ ఉంటాము. గుడిలో ఉన్న దేవుడిని మనం మోసం చేయవచ్చు ఎందుచేతనంటే ఆయన మనం కల్పించిన దేవుడు కాని మన హృదయంలో ఉన్న దేవుడిని మనం మోసం చేయలేము ఎందుచేతనంటే ఆయనను మనం కల్పించలేదు. లోపల జీవితం, బయట జీవితం వేరుగా ఉన్న ఇబ్బంది లేదు అని మనం అనుకొంటాము. కొంతమంది లోపల మనస్సులో ఒకటి పెట్టుకొంటారు, బయటకు వేరొకటి మాట్లాడుతూ ఉంటారు. మనలోపల ఉన్న బ్రహ్మం ఇవి అన్నీ చూస్తూ ఉంటుంది. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నేను మీ అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను, మీ దేహం యొక్క ప్రారబ్ధాన్ని అనుసరించి మిమ్మల్ని ఆడిస్తున్నాను. మీ తలంపును, మీ మాటను, మీ చేతను చూస్తూనే ఉన్నాను ఇది మర్చిపోవద్దు అని పరమాత్మ చెప్పాడు. మేము ఎక్కడికి వెళ్ళినా మంచినీళ్ళ సీసాలు తీసుకొనిపోతాము. అలాగే ప్రతీవాడి కూడా చావు తిరుగుతూ ఉంటుంది. మేము ఇప్పుడు మంచినీళ్ళ సీసా తెచ్చుకొన్నాము కాని ఇప్పుడు మంచినీళ్ళు తాగము, దాహం అయినప్పుడే తాగుతాము. అలాగే చావు ఏమి చేస్తుంది అంటే అది మన కూడానే ఉంటుంది, మనం నర్సాపురం వెళ్ళాము అనుకోండి, మన కూడా చావు వచ్చేస్తుంది కాని అది మనలను ఏమీ చెయ్యదు. నాకు దాహం అయ్యే వరకు మంచి నీళ్ళసీసా నా కూడా ఉన్నా నేను మంచినీళ్ళు పుచ్చుకోను. అలాగే చావు మన కూడా ఉన్నా అది మనలను ఏమీ చెయ్యదు, ఆ టైము వచ్చినప్పడు మీ శరీరం మీద పడి ప్రాణాన్ని తీసుకొనిపోతుంది. మనం ఈ భూమి మీద ఉండే రోజులు చాలా తక్కువ. మనకు లోపల జీవితానికి, బయట జీవితానికి సమన్వయం ఉండాలి. బంగారం తూచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో అంత జాగ్రత్తగా ఉంటూ మనం లోపల జీవితాన్ని, బయట జీవితాన్ని సమన్వయం చేసుకోవాలి. ఈ జీవితాలు సమానంగా ఉంటే భగవంతుడు ఏమి చేస్తాడు అంటే ఈ సమానమైన జీవితాన్ని ఒక వంతెనగా తయారుచేస్తాడు. అసత్యంలో నుండి సత్యంలోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి వెళ్ళటానికి ఈ జీవితాన్ని ఒక వంతెన కింద ఉపయోగించి, ఆ వంతెనను దాటించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, ఆయనే భగవంతుడు. మనం అవలంభించే పద్ధతులు హింసాత్మకంగా ఉండకూడదు. కొంతమంది చాడీలు చెప్పి సంతోషిస్తూ ఉంటారు, ఇలా సంతోషించేవారు ఎప్పటికయినా వడ్డీతో సహా దుఃఖాన్ని అనుభవించవలసి ఉంటుంది.

కొంతమంది మాటలో, చేతలో హింస ఉంటుంది, వారి ప్రవృత్తి హింసాత్మకంగా ఉంటుంది, వారు కూడా భవిష్యత్తులో దుఃఖం అనుభవించవలసిందే.

మనం ఏదైనా సాధించాలి అనుకొన్నప్పుడు అది ఎంత పవిత్రమయినదో దానిని సాధించటానికి మనం అనుసరించే మార్గం కూడా అంత పవిత్రంగా ఉండాలి. నేను ఏదిగా ఉన్నానో దాని తాలుక ఎఱుక నాకు వస్తే అది అమృతం, నేను కానిది అది ఎంత భోగ వస్తువు అయినా దానిని సాధించటంవలన ఎప్పటికైనా దుఃఖం వచ్చి తీరుతుంది, జనన మరణ రూపంలో సంసారం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు. మనం ఏ పని చేసినా అది కోరికతో చేస్తాము, దాని వలన ఫలితం వస్తుంది, దానిని అనుభవిస్తాము, దాని వలన వాసన పడుతుంది, మరల వాసనను బట్టి పని చేస్తాము. ఇది సంసారం, ఇదే పునర్జన్మలను తీసుకొని వస్తుంది. అసలు ఏ రకమైన కోరిక లేకుండా, గౌరవం కూడా ఆశించకుండా పనిచేసేవారు మనలో ఎంతమంది ఉన్నారు. మనం కోరికతో పని చేస్తాము, ఇదే సంసారాన్ని తీసుకొని వస్తుంది అన్న సంగతి మనకు అర్థమవ్వటంలేదు. దుఃఖానికి కారణం బయట ఈ సృష్టిలో ఎక్కడా లేదు, దుఃఖానికి కారణం నీలోపలే ఉంది, అది కర్తృత్వబుద్ధి రూపంలో ఉంది. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అనుకొంటాము. కలిసివస్తే మన తెలివితేటలు అంటాము, కలిసి రాకపోతే శనిగ్రహాన్నో, సూర్యుడినో, చంద్రుడినో లేక దేవుడినో పట్టుకొని తిడుతూ ఉంటాము. మనం కోరిక లేకుండా పని చేసినా ఫలితం వస్తుంది, అది నిన్ను బంధించదు, అది సంసార కారణం కాదు. మనం కోరికతో పనిచేస్తే దాని ఫలితం మనలను బంధిస్తుంది. మనం కర్తృత్వంతో ఏది చేసినా అది సంసారానికి కారణం అవుతుంది. అర్జునా! నీవు కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా మూడు లోకాలను నాశనం చేసినా నీకు పాపం అంటదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మాయ అనేది ఎక్కడ ఉంది అని మనం అనుకొంటాము. దీనికి ఉపనిషత్‌లలో ఎంత అందంగా చెప్పాడు అంటే నువ్వు ఆత్మవు, ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు. దేహానికి పుట్టుక ఉంది, చావు ఉంది. ఆత్మకు కర్తృత్వం లేదు, నేను అది సాధించాను, ఇది సాధించాను అని ఆత్మ అనుకోదు. నేను అది చేసాను, ఇది చేసాను అని నీవు అనుకొంటున్నావు. అలా అనుకొనేదే మాయ, అదే అజ్ఞానం. అందులో నుండి నీవు ఎన్ని జన్మలయితే బయటకు రాలేవో అంతకాలం నీకు శాంతి లేదు, ఆనందం లేదు. ఈ క్లూ అర్థం చేసుకోండి. అసలు ముందు దేహానికి, ఆత్మకు ఎట్టి సంబంధం లేదు అన్న సంగతి మనకు అర్థమవ్వాలి. ఆత్మ చనిపోదు, నువ్వు ఆత్మ అయివున్నావు. అయితే దేహం చనిపోయి నప్పుడు నేను చనిపోతున్నాను అంటావు. నేను చనిపోతున్నాను అని చెప్పే ఆ నేను ఎవరు?

అందులో నుండి విడుదలపొందు, అప్పుడు నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. దేహానికి, ఆత్మకు ఉన్న బేధం మనకు తెలియటం లేదు, అంతా కలగాపులగం చేసేసుకొంటున్నాము. మన అహంకారం వలన ఏమీ అవ్వదు, నీవు నిజంగా ఏదైనా సాధించినా అది భగవంతుడే సాధించాడు, అది మీకు తెలియక నేను సాధించాను అనుకొంటున్నారు. అసలు సాధించ టానికి మీరు అంటూ ఉన్నారా, మనం లేము, ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం. దానికి భిన్నంగా మీరు ఏదైనా చూస్తూ ఉంటే మీకు పొగరుబోతుతనం వస్తుంది, గర్వం వస్తుంది, చావు వస్తుంది, పుట్టుక వస్తుంది, ఆ జన్మకాజన్మ సంసారం నిన్ను వెంటాడుతుంది. ఇదంతా బ్రహ్మమే చేసింది అని అనుకోకుండా బ్రహ్మంకు భిన్నంగా మిమ్మల్ని చూసుకొంటూ ఉంటే మీకు మిగిలేది దుఃఖం, మీకు మిగిలేది సంసారం. నెహ్రూగారు మీటింగులలో ఒక మాట చెపుతూ ఉండేవారు. జీవితంలో కొంతమంది ముందు సుఖపడతారు, తరువాత కష్టపడతారు కొంతమంది ముందు కష్టపడతారు, తరువాత సుఖ పడతారు. స్వర్గం, నరకం ఎక్కడో లేదు. ముందు కష్టపడి, తరువాత సుఖపడితే ఆ సుఖమే స్వర్గం కింద ఉంటుంది. ముందు సుఖపడి తరువాత కష్టపడితే ఆ కష్టం నరకంగా ఉంటుంది. స్వర్గ నరకాలు ఈ భూమి మీదే ఉన్నాయి అని అనేవారు. ఏ బ్రహ్మం అయితే మన శరీరాలను ఈ భూమి మీదకు తీసుకొని వచ్చిందో, ఆ బ్రహ్మమే మన శరీరం ద్వారా పనిచేయిస్తుంది. సాధన అంటే ఏమీ లేదు. ఇప్పుడు మనకు ఏదైనా రోగం వచ్చింది అనుకోండి, డాక్టరు వైద్యం చేస్తాడు. డాక్టరు చేసే వైద్యానికి మనం సహకరించాలి. అప్పుడు రోగం తొందరగా తగ్గుతుంది. అలాగే చేసేది అంతా ఎవరు అంటే బ్రహ్మమే. ఇదంతా బ్రహ్మమే చేస్తోంది, నేను కాదు అని ఆ బ్రహ్మం చేసే పనికి సహకరించాలి, ఆ గుర్తింపు రావాలి. అప్పుడు అహంకారం నశిస్తుంది. చేసేది మనం కాదు, ఆయనే చేస్తున్నాడు, వూరికే మనలను పనిముట్టుగా ఉపయోగించు కొంటున్నాడు అని ఆయనకు సహకరిస్తే అప్పుడు మన అహంభావన నశిస్తుంది, మనకు బ్రహ్మభావన కలుగుతుంది.

మనం నిజంగా సాధకులం అయితే ఇతరులను బాధ పెట్టకూడదు. బ్రహ్మం యొక్క సంకల్పం సత్యసంకల్పం. మన సంకల్పం అసత్యసంకల్పం. మన దేహాన్ని ఏదైనా దురదృష్టం వెంటాడు తోంది అనుకోండి, అది బ్రహ్మంకు తెలియకుండా రావటం లేదు. అది బ్రహ్మం యొక్క సంకల్పాన్ని బట్టి అలా వస్తోంది అని దానిని ఓర్చుకొంటూ ఉంటే ఇంక రాబోయే జన్మలో అది రాదు. మనం పరీక్ష పెట్టాము, పాసైపోయారు ఇంక రాబోయే జన్మలో ఈ కర్మను తప్పిం చేద్దాము అని బ్రహ్మం అనుకొంటుంది. భగవంతుడిని కాదని నవగ్రహాలు కూడా ఏమీ చేయలేవు. భగవంతుడు వాళ్లకు కూడా డ్యూటీ ఇచ్చాడు, చెయ్యమన్నాడు

అంతే. భగవంతుడిని కాదని నవగ్రహాలు ఏదైనా చేస్తాయి అని అనుకోవటం ఎటువంటిది అంటే ప్రాణం పోయిన తరువాత ఒక మనిషి నడుస్తాడు అనుకోవటం ఎటువంటిదో ఇది కూడా అటువంటిదే. భగవంతుడి సంకల్పాన్ని నవగ్రహాలు అమలు జరుపుతూ ఉంటాయి, అంత వరకే, అధ్యక్షుడు భగవంతుడే, అవి స్వతంత్రంగా ఏమీ చేయలేవు. ఇప్పుడు మీకు ఏదైనా అదృష్టం రావచ్చు అది కూడా బ్రహ్మమే. అక్కడ కూడా బ్రహ్మంను చూస్తూ ఉంటే మీకు గర్వం రాదు. బ్రహ్మంకు భిన్నంగా ఏది చూసినా మీకు అశాంతి వస్తుంది, ఆ క్లూ మీకు అర్థ మవ్వాలి. అరుణాచలేశ్వరుడు జ్యోతి స్వరూపుడే. ఇప్పుడు మన కళ్లకు రాయికింద కనిపిస్తున్నాడు, మనకు రాయికింద కనిపించినా ఆయన జ్యోతి స్వరూపుడే. అరుణాచలం కథలో చెపుతారు, ఆయన ఆది, అంతం తెలుసుకోవటానికి బ్రహ్మ విష్ణువులు ప్రయత్నం చేసారు. కానీ ఫెయిల్ అయ్యారు. అంటే దేనికయితే ఆది లేదో, దేనికయితే అంతం లేదో, దేనికయితే చావుపుట్టుకలు లేవో, ఏదైతే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో అంతటా వ్యాపించి ఉందో అదే బ్రహ్మము, వాడే అరుణాచలేశ్వరుడు. పాములు పుట్టలలో ఎలా ఉంటాయో అలాగ కోరికలు అన్నీ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే మూడు పుట్టలలో ఉంటాయి. ఈ మూడింటిని అతిక్రమిస్తేనేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు.

మీరు ఏదో ఒక రూపాన్ని కల్పించు కోండి, ఆ రూపానికి ఒక పేరు పెట్టుకోండి, దేవుడు అనే భావనతో పూజలు చేసుకోండి మీకు కావలసినవి అడుగుతూ ఉండవచ్చు, ఆయన ఇవ్వవచ్చు, ఇదంతా సంసారం గొడవలే, వీటితో బ్రహ్మంకు ఏమీ సంబంధం లేదు. మీరు ఏదైనా అడిగితే ఆయన ఇస్తాడు, దానిని అనుభవిస్తే పోతుంది, మన శరీరం మటుకు ఎంతకాలం ఉంటుంది. భగవంతుడు ఇస్తే మనకు ఈ శరీరం వచ్చింది, ఇది భగవంతుడు ఇచ్చిన వరం. మంచితనం, జ్ఞానం కూడా భగవంతుడు ఇచ్చే వరాలే. దేహం వచ్చిన వారు అందరూ మంచిగా ఉండరు, దేహం వచ్చిన వారందరికీ జ్ఞానం కలుగదు. ఒకవేళ దేహం ఉండగా మంచితనం వస్తే, జ్ఞానం వస్తే ఇవి రెండూ భగవంతుడే ఇచ్చాడు అనుకోండి, అంతేగాని ఇవి నా తెలివితేటల వలన సంపాదించుకొన్నాను అనుకొంటే మరల సంసారంలో పడిపోతారు, ఇది బాగా అర్థం చేసుకోండి. ఎవడయితే ప్రకృతిని అతిక్రమించలేడో, ఎవడయితే సంసారాన్ని అతిక్రమించ లేడో వాడు బ్రాహ్మీస్థితిని పొందలేడు, ఆనందాన్ని పొందలేడు. కర్తురాజ్ఞయా అంటే అక్కడ కర్త ఈశ్వరుడు, ఆయన ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు. మనం స్వతంత్రులం కాదు. దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఆయన ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయవలసిందే. కాని మనం స్వతంత్రులం అనుకొంటున్నాము. ఆ స్వతంత్రాన్ని ప్రక్కనపెట్టి ఈశ్వరుని పాదాలకు శరణాగతి చేయటం నేర్చుకుంటే అదే సాధన. మనకు నేను అనే

భావన ఉంది. అది కలుషితంగా ఉంటుంది. మనం ఏదైనా మంచి పనిచేసినా ఆ నేను కోసమే చేస్తాముకాని భగవంతుడి ప్రీతికోసం చేయము. ఆ నేను మలంతో సమానము. కాని మనం దానిని బంగారం అనుకొంటున్నాము. మన లోపల మలం ఉంటే, మోషన్ అవ్వకపోతే, ఏదో బిళ్ళ వేసుకొంటే ఆ మలం పోతుంది కానీ ఈ నేను అనే మలం అలా పోదు. లోపల ఈ మలం ఉంది కాబట్టే ఎవరైనా పొగిడితే మనకు సంతోషం వస్తోంది, ఎవరైనా విమర్శిస్తే మనకు దుఃఖం వస్తోంది, లోపల నేను అనే మలం లేకపోతే ఏమీ లేదు, ఈ మాటలు ఏమీ అసలు లోపలకు వెళ్ళవు, అసలు తీసుకొనేవాడే కనబడడు. జ్ఞాని నిందలోను, స్తోత్రంలోను బ్రహ్మమునే చూస్తాడు, ఇంక వాడికి దుఃఖ కారణం లేదు. మనం హితవుగా మాట్లాడాలి, మితంగా తినాలి అదే నిజమైన వైద్యం. మీరు ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండండి, అతి పనికి రాదు. వ్యాసుడు భారతంలో ఒక మాట చెప్పాడు. నీకు ఏదైతే మంచిది కాదో ఆ పని ఇతరులకు ఎందుకు చేస్తున్నావు. నీకు మంచి కానప్పుడు అది ఇతరులకు మంచి ఎలా అవుతుంది. ఇతరులు ఏ పనిచేస్తే నీకు అపకారం అని నువ్వు అనుకొంటున్నావో అదే పని ఇతరులకు నువ్వు ఎందుకు చేస్తున్నావు. ఇతరులు ఏది చేస్తే నీకు మంచి అనుకొంటున్నావో ఆ మంచి పనినే నీవు ఇతరులకు చెయ్యవచ్చుకదా. వారు జీవితంలో నలిగిపోయి, జీవితసారాన్ని వడపోసి బంగారంలాంటి మాటలను మనచేతికి అందిస్తే మనకు జిజ్ఞాస లేదు, ముముక్షత్వం లేదు, సాధన లేదు, రోడ్డు మీద ఉన్న రాళ్ళకు ఇచ్చే విలువ కూడా ఆ మాటలకు మనం ఇవ్వటం లేదు.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ముందు ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని విశ్వసించండి, ఆ నమ్మకం ముందు మీకు కుదరాలి. పెంట అంతా మనస్సులోనే ఉంది, ఆ మనస్సును తీసుకొని వెళ్ళి ఈశ్వరుని పాదాలవద్ద ఉంచండి, ఈ మనస్సే ముడి. లోపల ఉన్న సద్వస్తువుకీ, ఈ శరీరానికి ముడిపెట్టేదీ ఈ మనస్సే. ఈ ముడి విడదీసుకోవటానికే సాధన. భగవంతుడిని విశ్వసించండి. మాకు జ్ఞానం ఎప్పుడు వస్తుంది, జ్ఞానం ఎప్పుడు వస్తుంది అని కనిపెట్టుకొని ఉండకండి. జ్ఞానం ఇచ్చినా, జ్ఞానం ఇవ్వకపోయినా అది నీ ఇష్టం, నీ సంకల్పమే నెరవేరాలి, అలా చెయ్యమని ఇలా చెయ్యమని నేను అడగను, నీకు ఎలా బాగుంటే అలా చెయ్యి అని భగవంతుడితో అనే స్థితికిరండి. అప్పుడు భగవంతుడు మిమ్మల్ని శాంతితో, ఆనందంతో తడుపుతాడు. భక్తిని, జ్ఞానాన్ని, వైరాగ్యాన్ని ప్రసాదించమని మామూలుగా అందరూ భగవంతుడిని అడుగుతారు. అలా అడగటం మంచిదే. మేము అరుణాచలం చాలాకాలం నుండి వెళుతున్నాము, ఇంతకాలం నుండి అరుణాచలం వెళు తూ ఎప్పుడూ జ్ఞానం కూడా అడగలేదు. అయితే ఎందుకు వెళుతున్నాము అంటే ఇష్టం

ఆపుకోలేక వెళుతున్నాము. జ్ఞానం కోసం ఇష్టం రావటం కాదు, ఇష్టం కోసమే ఇష్టం. టైము వచ్చేవరకు చావు ఎలా రాదో అలాగే టైము వచ్చే వరకు జ్ఞానం కూడా రాదు. ఏది ఎప్పడు జరగాలో అప్పడు జరుగుతుంది. చలంగారు ఒక ముతకసామెత చెప్పేవారు కంగారుపడితే దొడ్డికే రాదండి, ఇంక కంగారుపడితే జ్ఞానం ఎలా వస్తుంది అనేవారు. అది ఎప్పడు రావాలో అప్పడు వస్తుంది, ఈలోపుగా కంగారుపడితే వచ్చేయదు. ఇవాళ ఊడ్చి రేపు కోసేస్తాము అంటే ఏమి వస్తుంది, దానికి టైము రావాలి, పక్వస్థితి రావాలి. మేము ఇన్నిసార్లు అరుణాచలం వెళితే దానివలన ఏమీ ప్రయోజనం రావటం లేదు అని కాదు కొబ్బరికాయను పదిసార్లు కొడతాము, అది పదోసారి పగిలింది అనుకోండి, మొదటి తొమ్మిది దెబ్బల ప్రయోజనం లేదు అనుకోవద్దు, ఆ తొమ్మిది దెబ్బల ప్రభావం కొబ్బరికాయమీద ఉంటుంది, పదోసారి పగిలింది అంతే. అలాగే అరుణాచలం వెళ్ళినప్పడు ఎప్పడయినా ఒక రోజున జ్ఞానం వస్తే అది ఆ ఒక్కరోజు ఫలితమే కాదు, ఈ ఇష్టానికి సంబంధించిన ఫలితం. అరుణాచలం వచ్చినవారు ఎవరూ వట్టి చేతులతో బయటకు వెళ్ళరు, నాస్తికులు ఆస్తికులు అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు, భక్తులు జ్ఞానులు అవుతారు. జ్ఞాని మాత్రమే ఈశ్వరుడి స్వరూపాన్ని పొందుతాడు. ఓ నిప్పా నీ మీద చెయ్యి వేస్తున్నాను, నన్ను కాల్చు అని నిప్పని అడగనక్కరలేదు, అది చేసే పని అది చేసేస్తుంది. అలాగే అరుణాచలం మనం వెళ్ళి వస్తూ ఉంటే అరుణాచలేశ్వరుడు చేసే పని ఆయన చేసేస్తాడు, మనం అడగటంతో సంబంధం లేదు. భక్తులకు భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీ ఇష్టం వచ్చినట్లుగా భగవంతుడిని ఉండమని చెప్పవద్దు ఆయన ఇష్టానికి అనుగుణంగా నీవు ఉండు, నువ్వు చెప్పినట్లు ఆయన వినాలి అనుకోకు, ఆయన చెప్పినట్లు నువ్వు విను, అదే సాధన, అదే భక్తి. అంతేగాని మూఢ నమ్మకాలతోటి మూర్ఖత్వంగా జీవించటం అది భక్తి కాదు. మీరు చెప్పినట్లు భగవంతుడు వినటం కాదు, ఆయన చెప్పినట్లుగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవటమే జ్ఞానం. మీరు తొందర పడి ఇది కావాలి, అది కావాలి అని భగవంతుడిని ఏమీ అడగవద్దు. మీకు ఏది మంచిదో మీ కంటే ఆయనకే బాగా తెలుసు. ఆయనకు తెలియదని మీరు అనుకొంటున్నారు అంటే మీ అహంకారం ఎంతదూరం వెళ్ళిపోయింది అంటే భగవంతుడికి ఏమీ తెలియదు అనుకునేంత దూరం వెళ్ళిపోయింది. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వసాక్షి. భగవంతుడి గురించి ఐన్‌స్టీన్ అంటాడు ఆయన మీ కళ్ళకు కనబడడు, మీ మనస్సుకు అందడు, అంత మాత్రం చేత ఆయన లేడు అని అనుకోవద్దు. నీ చేత చూడబడేది ఏదీ నిజంకాదు, నీచేత చూడబడేది ప్రతీదీ నశిస్తుంది. దేవుడు నీచేత చూడబడుతూ ఉంటే ఆయన నిజం ఎలా అవుతాడు. నిజంకానిదానిని కష్టపడి తెలుసుకోవటం ఎందుకు. నీచేత చూడబడేది

వ్యవహారిక సత్యం, పారమార్థిక సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. ఈ అనేకంలో ఒక్క దానిని నువ్వు చూడలేకపోతున్నావు. ఈ అనేకంలో ఒక్క దానిని నువ్వు ఎంత కాలం అయితే చూడలేవో అంతకాలం నిన్ను సంసారం విడిచిపెట్టదు. మన మీద దయతో ఎంతదూరం వెళ్ళి చూపుతున్నాడో చూడండి. జ్ఞాని చూపే కాదు, జ్ఞాని మాట కూడా దయ. నీ చూపు నా అహంకారానికి కోత అనేవారు చలంగారు భగవాన్‌తో. నీవు చల్లగానే చూస్తున్నావు అని పైకి అనిపిస్తోంది కానీ నా అహంకారానికి నిప్ప పెడుతున్నావు అన్న సంగతి నాకు తెలుస్తోంది. చలంగారు ఎంత గొప్పవాడు అని అనుకోవాలని ఇంతవరకు నేను అనుకొనేవాడిని, నీ దగ్గరకు వస్తే వాడికి నిప్ప పెడతావని తెలియకవచ్చాను, వాడికి నిప్ప పెట్టావు, చలాన్ని చలానికి కాకుండా చేసావు భగవాన్ అన్నారు. చూడటం బాగానే చూస్తున్నావు, బాగానే నవ్వుతున్నావు. ఆచూపు, ఆ నవ్వు నా కొంపకు నిప్ప పెడుతున్నాయి అన్న సంగతి నాకు తెలుస్తోంది. ఆ నిప్ప పెట్టినప్పడు నాకు కొంచెం మంట మంట అంటున్నాను. ఆ మాత్రం మంట అనే మూల్యం చెల్లించకుండా నీకు మోక్షం ఎలా వస్తుంది అని నీవు అంటున్నావు.

ఒకసారి భగవాన్ దగ్గరకు ఒక భక్తుడు వచ్చి నాకు ఉన్నదంతా పోయింది అంటాడు. నీకు బతకాలని ఆశ ఉందా అని భగవాన్ అడిగారు. ఆశ ఉంది అంటాడు. అదే అన్నీ తెస్తుంది అంటారు భగవాన్. మీరు ఎన్ని విడిచిపెట్టినా భగవదనుభవం పొందగలము అనే ఆశను మటుకు విడిచిపెట్టవద్దు. ఇప్పడు మీకు భక్తి లేదనుకోండి, కంగారుపడవద్దు, భక్తిని సంపాదించుకోండి, భక్తి వలన ముక్తి వస్తుంది. భగవంతుడు మీకు ఎప్పడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో అన్నీ ఇస్తాడు, మోక్షం కూడా ఇస్తాడు. మీరు బెంగలు, చింతలు పెట్టుకోవద్దు. మీరు బతికి ఉండగా మిమ్మల్ని కాల్చేయటానికి చింతాకంత చింత చాలు. అందుచేత చింతవద్దు, భక్తిని జ్ఞానాన్ని నేర్చుకోండి, సజ్జనసాంగత్యం చెయ్యండి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మన హృదయంలోనే దేవుడిని పెట్టుకొని అక్కడ దేవుడు ఉన్నాడు, ఇక్కడ దేవుడు ఉన్నాడు అని ఎక్కడికెక్కడికో వెళ్ళిపోతున్నారు. అంటే ఇంట్లో ఉన్న బంగారాన్ని వదులుకొని రోడ్డు మీద ఉన్న రాళ్ళను ఏరుకొంటున్నాము. హృదయంలో ఉన్న బంగారాన్ని వదిలేసాము, ఎక్కడో బొమ్మ పెడుతున్నాము, ఆ బొమ్మను విష్ణువు అంటున్నాము, ఒకడు రాముడు అంటున్నాడు, ఒకడు శివుడు అంటున్నాడు, చేసుకోండి మంచిదే, వాడు మిమ్మల్ని కల్పించాడు, మీరు వాళ్ళను కల్పించుకోండి, వారికి మీకు జత సరిపోతుంది అంటున్నారు. మన హృదయంలో ఉన్న వస్తువు తప్పించి ప్రతీదీ కల్పించబడినదే. కాల ప్రవాహంలో నీ దేహం ఎలా కొట్టుకొనిపోతుందో అలాగే నువ్వు కల్పించిన గుళ్ళు, గోపురాలు కూడా అలాగే

కొట్టుకొనిపోతాయి. అంటే భక్తి లేకుండా చెపుతున్నాడు అని మీరు అనుకోకండి, మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో అక్కడకు తీసుకొని వెళ్ళటం కోసం ముందు జాగ్రత్తగా ఇవన్నీ చెపుతున్నాడు, అంతేగాని తప్పించుకొని తిరగటానికి కాదు. మీకు ఏదైనా ప్రేమ ఉంది అనుకోండి, ఆ ప్రేమను ఇక్కడే ఆపకుండా వీటిని అతిక్రమించి హృదయంలోనికి వెళ్ళాలని చెప్పటంకోసం చెపుతున్నాడు.

మీ దేహం ద్వారా ఏవైనా మంచి పనులు జరిగినా అవి భగవంతుడే చేసాడు కాని మీ అహంకారం వలన ఏదీ కాదు. కొన్ని కొన్ని మనం నమ్మలేము. వంద రూపాయలు కావలసి ఉంటే ఇంటి దగ్గర లేక పక్కింటికి వెళ్ళి తెచ్చుకొన్న వారు ఇప్పడు వెయ్యికోట్లకు అధిపతి. ఇందులో వారి తెలివితేటలు ఏమీ లేదు, అది బ్రహ్మమే చేయించింది. అంటే నీ దేహంలో అది అనుభవించవలసి ఉంది, అది నీకు ఇచ్చాడు అంతే గాని నీ తెలివి కాదు. బ్రహ్మంకు భిన్నంగా ఏది చూసినా మీకు సంసారం మిగులుతుంది. మీ అదృష్టంలో దురదృష్టంలో బ్రహ్మంనే చూడండి, మీ దారిద్ర్యంలో ఐశ్వర్యంలో కూడా బ్రహ్మంనే చూడండి, మీ చావుపుట్టుకలలో బ్రహ్మంనే చూడండి, లోకం అంతా బ్రహ్మంనే చూడండి మనకు మోక్షం రాదుగాని సంసారం గ్యారంటీగా వస్తుంది ఎందుచేతనంటే కోరిక లేకుండా పని చేస్తే మోక్షం వస్తుంది కాని మనం కోరికతో పని చేస్తాము. కోరికతో ఏ పని చేసినా ఆ పని నీకు సంసారాన్ని తీసుకొని వస్తుంది. లోకానికి సంబంధించిన సంతోషాన్ని ఎవడైతే కోరుకొంటున్నాడో వాడికి తప్పకుండా దుఃఖం వచ్చి తీరుతుంది. మీకు గులాబీ పువ్వు ఎవరైనా ఇచ్చారు అనుకోండి, ఆ గులాబీతో పాటు దానిలో ఉన్న ముళ్ళు కూడా మీకూడా వచ్చేస్తాయి. అలాగే ఈ లోకానికి సంబంధించిన సంతోషాన్ని ఎవడైతే కోరుకొంటున్నాడో ఆ సంతోషం వెనకాల దుఃఖం కూడా వచ్చేస్తుంది అన్న సంగతి మర్చిపోవద్దు. కాలప్రవాహంలో ఈ సంతోషం ఎలా వచ్చిందో, దుఃఖం కూడా అలాగే వచ్చి తీరుతుంది, ఇందులో రాజీ లేదు. బ్రహ్మమును చూసి మీరు ప్రపంచాన్ని చూస్తే ప్రపంచం కూడా బ్రహ్మంగానే కనిపిస్తుంది. మీలో ఉన్న బ్రహ్మంను చూడకుండా ప్రపంచాన్ని చూస్తే ప్రపంచం ప్రపంచంగానే కనిపించటమే కాదు అది మిమ్మల్ని బంధిస్తుంది. అందుచేత భగవాన్ ఏమని చెప్పారంటే నీవు లోకాన్ని చూడాలంటే చూడుకాని ముందు నిన్ను నువ్వు చూసుకొని తరువాత లోకాన్ని చూడు. అప్పడు లోకం అంతా ఉన్నది నువ్వే అన్న సంగతి నీకు తెలుస్తుంది.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

08-06-05 } ఆరుణాచలం క్యాంపు
16-06-05

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## ఆత్మ విశ్వాసమే నిజమైన సంపద

మానవ చరిత్ర అంతటినీ పరిశీలించి చూస్తే ఘనకార్యములు చేసినవారి సామర్థ్యమంతా వారి ఆత్మ విశ్వాసం వలనే అని తేలుతుంది. నిర్భయత్వం అంటే, మాయను విశ్వసించక సజీవజ్ఞానాన్ని కలిగి ఉండటం. సత్యాత్మలో సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండటం. అన్ని భయాలకు నిలయమైన "ఈ దేహమే నేను" అని భావించినప్పడే మనకు భయం కలుగుతుంది. శరీరాన్ని ఎప్పడూ బాధ-విచారమనే కీటకాలు తినేస్తూ ఉంటాయి. ఈ అల్పమైన అజ్ఞానాన్ని వీడినప్పడే మనం నిర్భయుల మౌతాము. సత్యాత్ముడవై జీవిస్తే మనలను ఎవ్వరూ ముట్టుకోలేరు. ఏ కీడూ చెయ్యలేరు. ఆపదలో కాపాడేది మన ఆత్మ విశ్వాసమే. శ్రీనాన్నగారు అంటారు "నీవు ఆత్మ విశ్వాసం పొందకపోతే మరణించిన వానితో సమానం. నీకు ఆత్మ విశ్వాసం ఉంటే ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అంత మంది శతృవులు ఉన్నా నీకు ఏ హానీ ఉండదు. లౌకికమైన తాత్కాలికమైన విషయాలపై దృష్టిని కేంద్రీకరిస్తే అజ్ఞానంలో పడతాము. మనగమ్యము ఏమిటో నిరంతరం జ్ఞాపకం చేసుకోవాలి" అన్నారు. చాలామంది ఊహించుకొని బెంగపెట్టుకుంటారు భగవాన్ "ఈ అబద్ధాలకు బెంగలు కూడానా" అన్నారు. ఈ దేహం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పనులు ఈ దేహం ద్వారా జరిగి తీరుతాయి. జీవిత సమస్యలు అన్ని ఇప్పడే పరిష్కారమై పోవాలని అనుకోకూడదు. కర్త యొక్క ఆజ్ఞ అనుసరించే వస్తున్నాయనే విశ్వాసంతో ఓర్పుతో జీవించాలి. కారణం అంతా మనలోనే ఉంది అనే విశ్వాసంతో జీవిస్తే కర్మల బాకీ తీరుతుంది. బయట వ్యక్తులు కారణమని నిందిస్తే వడ్డీ తగులుతుంది. హృదయం ఖాళీ అవ్వదు, మనలో ఉన్న పాపమే భయం రూపంలో వ్యక్తమౌతుంది. గురుపాద పంచకం పై పరిపూర్ణ విశ్వాసం ఉంటే మనకు తెలియకుండానే మన హృదయం ఖాళీ అవుతుంది. గురుప్రేమలో ఊగిసలాడే వానికి బంధాలు, భయాలు, బాధలు ఎక్కడ? "నా భక్తులు ఎన్నడూ నాశనం కారని" పరమాత్మ ప్రమాణం చేసి చెప్పాడు. దీన్ని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం



నర్సాపురం శ్రీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో
లక్ష్మీదేవి విగ్రహం ఆవిష్కరించిన సద్గురు శ్రీ నాన్నగారు

